రేషన్ డీలర్లకు ఇ-పాస్ పరికరాలు

పంపిణీ చేస్తున్న జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి -పాడేరు: డిఆర్ డిపో డీలర్లకు ఈపాస్ యంత్ర పరికరాలను జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం జె అభిషేక్ గౌడ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేసారు. పాడేరు మండలంలో ఉన్న 45 డిఆర్ డిపోలలో 65 ఏళ్లు నిండిన లబ్దిదారులకు పైలట్ ప్రాజెక్టు కింద ముందుగా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. రేషన్ పంపిణీని పారదర్శకంగా జరగాలన్నారు. అంచెలంచెలగా జిల్లా వ్యాప్తంగా ఉన్న డిఆర్ డిపో డీలర్లకు ఈపాస్ యంత్రాలను పంపిణీ చేస్తామన్నారు. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, సివిల్ సప్లైస్ డి. ఎం. వి.మోహనరావు, డిప్యూటీ తాహాశీల్దార్ ఒ.ప్రశాంత్ ఈపాస్ టెక్నిషియన్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

చాపరాయిపై చదువులు!

- వసతి లేమితో గిరిబాలల అవస్థలు
- టార్పాలిన్ల కింద, చెట్ల నీడన తరగతులు
- చినుకు పడితే పరాయి పంచకు పరుగులే
- ఏళ్ల తరబడి పాఠశాలలకు భవనాల్లేక అవస్థలు

టైడా గ్రామంలో చాపరాయి పై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

పక్కా భవనాల్లో, గది నాలుగు గోడల మధ్య, అనువైన సౌకర్యాలతో విద్యాబోధన జరగాలని విద్యాహక్కు చట్టం నిర్దేశిస్తుంటే, అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో ఏజెన్సీలోని అనేక గ్రామాల్లో గిరిబాలల చదువులు అవస్థల నడుమ సాగుతున్నాయి. మెజార్టీ పాఠశాలలకు భవనాలు లేకపోగా, చెట్ల నీడన, పూరిపాకలు, టార్పాలిన్ల కింద, గ్రామాల్లో ఇంటి వరండాల్లో, చివరకు గ్రామశివారున చాపరాయి బండలపైనా చదువులు సాగించాల్సిన దుర్భర, దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఊరుకో రకమైన సమస్య ఉండగా, అంతిమంగా అన్నింటా వసతిలేమి స్పష్టంగా కనిపిస్తోంది. వసతి లేని పరిస్థితుల్లో ఇతర సౌకర్యాలను ఆశించడం అత్యాశకాక ఇంకేమిటనే వాదన వినిపిస్తోంది. అనంతగిరి మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల్లో వసతి కష్టాలు, గిరిబాలల ఇక్కట్లపై కథనం...

ప్రజాశక్తి -అనంతగిరి

విద్యాభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు కోట్లకు కోట్లు వెచ్చిస్తున్నామని ప్రభుత్వాలు, పాలకులు ప్రకటించడం షరామామూలుగానే జరిగిన పరిస్థితుల్లో అనంతగిరి మండలంలోని అనేక పాఠశాలలను పరిశీలిస్తే ఇదంతా ఒట్టిమాటలేనని చెప్పక తప్పదు. నేటికీ అనేక పాఠశాలలకు భవన సదుపాయం లేదంటే అతిశయోక్తి కాదు. పాఠశాలల్లో వసతి కల్పనకు ఎన్నెన్నో పథకాల కింద నిధులు కేటాయించినా, అవి మన్యవాసుల దరికి చేరలేదు. చివరకు గత వైసిపి ప్రభుత్వహయాంలో నాడు నేడు పథకం కింద సర్కారు బడులను రూపు రేఖలు మార్చేందుకు వేల కోట్ల నిధులు విడుదలైనా, మన్యంలోని మారుమూల గ్రామాలకు మొండి చేయి గత్తెంది. ఇపుడు కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటిస్తుండగా, అవి ఆచరణలో అల్లూరి మన్యం దరికి చేరడం లేదు. ఫలితంగా మండలంలో 31పాఠశాలలకు పూర్తిగా పాఠశాల భవనాలు లేవని విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బూరిగ పాఠశాలలో భవనం లేక విద్యార్థులు చింత చెట్టు నీడన చదువులు సాగిస్తున్నారు. ఇక వర్షాలు కురిస్తే గ్రామంలోని ఎవరో ఒకరి ఇంటి పంచన, వరండాల్లో చేరాల్సిందే గుమ్మ పాఠశాలకు భవనం లేకపోవడంతో అంగన్వాడీ కేంద్రంలో కానిచ్చేస్తున్నారు. ఊటగెడ్డలో పాఠశాల భవననిర్మాణానికి నిధులు మంజూరైనా లింటల్ లెవెల్ వరకు పనులు జరిగి నిలిచిపోవడంతో

బూరిగలో చింతచెట్టు కింద టెంటులో చదువుతున్న విద్యార్థులు

గ్రామంలోని రోజుకో ఇంటి వరండాలో చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. రాయిపాడు పాఠశాల విద్యార్థులు ఇరుకు వంట గదిలో చదువుకుంటున్నారు. గడ్డిబంద, బోనూరు, దబ్బలపాడు, వి.బంధవలస, మల్లెపాడు, ఒనుకొండ, గూడెం, రాసకీలం, గాదిలోవ, దన్నుకోట, టైడా, మద్రేబు, రెడ్డిపాడు, తునిసుబు, కొత్త బూరుగ మల్లెపాడు, డొంకపుట్టు, బందవలస, బుడ్డిగరువు, చింతలపాలెం, దాసరితోట, గంగవరం, కాకరపాడు, బుర్దగెడ్డ వంటి దాదాపు 30గ్రామాల్లో పాఠశాలలకు కనీస భవనం లేక అవస్థలు నడుమ విద్యాబోధన సాగిస్తున్నారు. ఆరుబయటే ఎండ ల్లోనే చదువులు సాగుతుండగా, చినుకు పడితే ఇళ్ల పంచకు చేరుతున్నారు. టైడాలో చాపరాయిపైనే చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇక వర్షం కురిస్తే ఏదోఒక పంచన చేరక తప్పని దయనీయస్థితిలో నెట్టుకొస్తున్నారు. కూటమి పాలనలోనైనా తమ పాఠశాలలకు వసతి కష్టాలు తీర్చాలని, గిరిబాలలకు ఆహ్లాదరక వాతావరణం లో చదువులు సాగేలా చూడాలని కోరుతున్నారు.

పాకల్లో చదువుకుంటున్న మల్లెపాడు విద్యార్థులు

ప్రభుత్వాలు మారినా కష్టాలు షరా మామూలే

ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజన గ్రామాల్లో పాఠశాలలకు వసతి కష్టాలకు మోక్షం లభించడం లేదు. భవనాలు లేని పరిస్థితుల్లో వంటగదులు, తాత్కాలిక షెడ్లు, టార్పాలిన్‌నీడన, చివరకు టైడా వంటి గ్రామాల్లో చాపరాయిమీద చదువు కోవాల్సిన దుస్థితి. వర్షం పడితే విద్యార్థులు, మాస్టార్లు పడే కష్టాలు చెప్పనలవికాదు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలకు భవన సౌకర్యం కల్పించాలి.

– సివేరి.కొండలరావు, డొంకపుటు గ్రామం, వేంగడ పంచాయతీ

ప్రభుత్వానికి నివేదించాం

మండలంలోని మారుమూల గ్రామాల పాఠశాలలకు భవనాలు లేని పరిస్థితులపై నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందించాం. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరయ్యాక నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతానికి వసతి లేక అనేక గ్రామాల్లో పాఠశాల నిర్వహణ కష్టంగా ఉన్నమాట వాస్తవం.

– బాలాజీ, మండల విద్యాశాఖ అధికారి, అనంతగిరి

యూరియా కొరతతో అన్నదాత అవస్థ

- ఎన్ని ఎకరాలు భూమి ఉన్నా ఒక రైతుకు ఒక్కటే బ్యాగ్
- ఎరువు కోసం రైతులు బారులు

వ్యవసాయకార్యాలయం వద్ద రైతులు

యూరియా కోసం క్యూలో నుంచున్న రైతులు

ప్రజాశక్తి -చింతూరు : విలీన మండలాల్లో వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా కొరత ఏర్పడడంతో విలవిలాడుతున్నారు. ఎంతో శ్రమించి సాగు చేస్తున్న వరి పైరుకు యూరియా సరైన సమయంలో అందకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అధిక శాతం గిరిజనులు వరి సాగు చేస్తుంటారు. ఎకరాకు కనీసం ఒక యూరియా బస్తా వేయాల్సి ఉంటుంది. కానీ 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా కేవలం ఒక్క ఎకరానికి సరిపోయేటట్టుగా ఒకేఒక బ్యాగు ఇవ్వడంతో రైతులు ఏంచేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మొన్నటివరకూ గోదావరికి వరదలు చుట్టుముట్టడంతో పంటలు మునిగిపోతాయని భయంతో రైతులు వణికిపోయారు. వరద భయం కాస్త తొలగిపోవడంతో వరి రైతులకు యూరియా కొరతతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. చింతూరు మండలంలో సుమారుగా 3 హెక్టార్ల వరి సాగు చేస్తుండగా వారికి సరిపడా యూరియా సకాలంలో అందించాల్సిన అవసరం ఉంది. కేవలం వర్షాధారంపై ఆధారపడి ఉన్న రైతులకు కనీసం యూరియా అందించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై వ్యవసాయ అధికారి రత్నప్రభను 'ప్రజాశక్తి' వివరణ కోరగా ముందుగానే రెండు నెలల క్రితం రైతులు యూరియాను స్టాక్ పెట్టుకున్నారని ఇప్పుడు మళ్లీ యూరియా కావాలని వచ్చేవారు కొత్తగా వస్తున్నారని ఆర్ఎస్కే లో ఇండెంటు పెట్టడం జరిగిందన్నారు. 24 టన్నుల యూరియా ఇండెంటును పంపించామని వారం రోజుల్లో ఆర్ఎస్కే పాయింట్లు యూరియా తెప్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా యూరియాకు బదులుగా నానో యూరియా లిక్విడ్ ద్రావణాన్ని రైతులు వాడాలని వాటిపై అవగాహన పొందాలని అదికూడా యూరియా లాగానే పనిచేస్తుందన్నారు. వరి పంటలపై స్ప్రేయింగ్ చేయాల్సి ఉంటుందని యూరియా కంటే అధికంగా ప్రభావితం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 260 బ్యాగులు గ్రోమోర్ షాపులో స్టాక్ ఉన్నాయని రూ.267కు వీటిని విక్రయించటం జరుగుతుందని ఆమె తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి యూరియా తరలివెళుతుందని సమాచారం ఉందనే విషయం ఎఒను అడగగా అటువంటిదేమీ లేదని అటువంటిదేమైనా జరిగితే సంబంధిత షాపు యజమానికి షోకాజ్ నోటీసు ఇచ్చి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

నాలుగు ఎకరాలకు ఒక బస్తా ఎలా సరిపోతుంది

నేను నాలుగు ఎకరాల్లో వరి పైరు వేశాను. చింతూరు వచ్చి డీలర్‌ను సంప్రదించగా నాలుగు ఎకరాల పట్టా కాగితాలు కూడా తెచ్చి చూపించడం జరిగింది. కానీ కేవలం ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇస్తామని చెప్పారు. మిగతా మూడు ఎకరాలకు ఏమి చేయాలో పాలు పోవడం లేదు. రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి.

– సోడి సత్యనారాయణ, కొత్తపల్లి

ఏడు ఎకరాలకు ఒక్క బస్తాయే ఇచ్చారు

నాకు ఏడు ఎకరాలు పొలం ఉంది. అయినా కేవలం ఒక యూరియా బస్తా మాత్రమే ఇచ్చారు. మిగిలిన 6 ఎకరాలకు యూరియా లభించలేదు. ప్రభుత్వం అధికారులు వరి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి. అప్పులు చేసి యూరియా కొందామన్నా కానీ దొరికే పరిస్థితి లేదు.

– కరణం బొజ్జి, కొత్తపల్లి

సూపర్ 50 ద్వారా ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజన పాఠశాలల్లో చదువుతున్న 50 మంది బాలబాలికలను ఎంపిక చేసి సూపర్ 50 ప్రొగ్రాం ద్వారా ప్రత్యేకక్లాసులు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 ప్రోగ్రాం ద్వారా ఎంపిక చేసే విద్యార్థులకు రాతపరీక్ష కార్యక్రమాన్ని పిఒ,సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్ గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సూపర్ 50 ప్రొగ్రాం ద్వారా ఎంపిక చేసే విధంగా 35 పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు ఈ ప్రొగ్రాం ద్వారా ఎంపిక చేయుటకు 255 మందికి పరీక్ష నిర్వహించామన్నారు. మంచి మార్కులతో పాసైన 50 మంది బాల బాలికలను ఎంపిక చేసి బాలికలకు రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో బాలురకు దేవరపల్లి గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేకమైనవిద్య బోధించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని సూచించారు. సూపర్ ఫిఫ్టీ ప్రొగ్రాం ద్వారా బాగా చదువుతున్న బాల బాలికలకు ఇంటర్మీడియెట్‌లో నచ్చిన సబ్జెక్టులలో చదువుకునే విధంగా ఈ ప్రొగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్. నాగజ్యోతి, ఎంఇఒ రమేష్, డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయ సూపర్డెంట్ బి. కిషోర్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు చేస్తున్న పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ శుభంనొక్వాల్

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే

డీలర్లపై క్రిమినల్ కేసులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టం దినేష్ కుమార్

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎరువులు సమస్యలేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. డిమాండ్ ఆధారంగా సప్లై చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుంచి ఎరువుల డీలర్లు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. డీలర్లు అధిక ధరలకు విక్రయించడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం ఎపిపిలు ఫిర్యాదు చేసారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు.

మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ఎరువులు నిల్వలు, ఇంకా ఎంత అవసరం ఉంటుందో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల సరఫరాపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాస్తామన్నారు. గంగవరం మండలానికి చెందిన రైతులు ఎక్కడ నుండి ఎరువులు కొనుగోలు చేస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. దేవీ పట్నం, గంగవరం, రంపచోడవరం మండలాలకు ఎరువుల కొరత లేదని అధికారులు వివరించారు. ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేసి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎరువుల సరఫరాపై తాహాశీల్దారులు, సబ్ కలెక్టర్లు ప్రతిస్పందన రిపోర్టులు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జెసి ఐటిడిఎ పిఒలు డాక్టర్ . ఎం.జె. అభిషేక్ గౌడ, కె.సింహచలం, సబ్కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.బి. ఎస్.నంద్, పలువురు వ్యవసాయాధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, రోడ్డు సౌకర్యం కల్పించాలి

- పీసా మండల కమిటీకి బూసుపల్లి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి- జి.మాడుగుల : తమ గ్రామానికి పాఠశాల, రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని వంజారి పంచాయతీ బూసుపల్లి గ్రామస్తులు మండల పీసా కమిటీ సభ్యులకు మొరపెట్టుకున్నారు. సోమవారం బూసుపల్లి గ్రామాన్ని మండల పీసా కమిటీ అధ్యక్షులు లకే. రామకృష్ణ, మండల సభ్యుడు గెమ్మెలి పెద్దబ్బాయి, ఇతర టీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బూసుపల్లి గ్రామం ఏర్పాటై దాదాపు 50ఏళ్లు గడుస్తున్నా నేడున్న 80 కుటుంబాల గిరిజనులు నానా అవస్థలు పడుతున్నామని తమ ఆవేదన వెలిబుచ్చారు. గ్రామంలో 30 మందికి పైగా బడిఈడు పిల్లలున్నా గ్రామంలో పాఠశాల లేకపోవడంతో బూసుపల్లి నుంచి కృష్ణాపురం వరకు ప్రతిరోజూ కాలినడన గెడ్డలు దాటుకుంటూ రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి అవస్థల మధ్య విద్యాబోధన చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. వర్షాల సీజన్‌లో ఉప్పొంగిన గెడ్డలను దాటి వెళ్లిరావడం ప్రాణసాహసమే అయినా తప్పడం లేదని వాపోతున్నారు. గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, అలాగే రహదారి సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

దీనిపై పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ మాట్లాడుతూ, సమస్యలన్నీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గెమ్మెలి పంచాయ పొత్తడగుంది పీసా సెక్రెటరీ తాబేలు సుబ్బారావు, గొందిమెలక క్లస్టర్ పీసా అధ్యక్షులు బురిడి. సుబ్బారావు, కృష్టాపురం క్లస్టర్ పీసా అధ్యక్షులు పంతాల లక్ష్మణ్, ఆయా కమిటీల కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు

బూసుపల్లిలో పర్యటిస్తున్న పీసా మండల కమిటీ

సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకుంటున్న బాలకృష్ణ

నందిగామ సర్పంచ్‌గా పులుసు బాలకృష్ణ

ప్రజాశక్తి- ఎటపాక : నందిగామ పంచాయతీ సర్పంచ్ ఇంగిలపు బేబీ తప్పనిసరి వ్యక్తిగత కారణాల రీత్యా ఈ నెల 4 వ తేదీన అమెరికాకు వెళ్ళినందున, డివిజనల్ అభివృద్ధి అధికారి మరియు డివిజనల్ పంచాయతీ అధికారి, రంపచోడవరం ప్రతిపాదనల మేరకు ఉపసర్పంచ్ పులుసు బాలకృష్ణ తాత్కాలికంగా సర్పంచ్ బాధ్యతలు చేపట్టేందుకు జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.సురేష్ సమక్షంలో సర్పంచ్‌గా పులుసు బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వార్డుమెంబర్ కందుల సతీష్, తానికొండ వాసు, గొడపర్తి చిన నాగయ్య, గ్రామస్తులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందిస్తున్న సర్పంచ్ రామారావు

రేషన్‌కార్డుల ప్రకారం ముంపు బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: చిన్న మట్టపల్లి పంచాయతీలోని ప్రత్తిపాక గుండుగూడెం, చింతరేగుపల్లి, తుష్టివారిగూడెం, కన్నాయిగూడెం గ్రామాల్లో రేషన్‌కార్డ్ ప్రకారం కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, ఆయిల్ ప్యాకెట్ పంపిణీ చేశారు. సర్పంచ్ పిట్టా రామారావు ముంపు బాధితులకు వీటిని అందించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, పీసా ఉపాధ్యక్షులు జయరాజు, ముత్యాల మురళి సోడి రామారావు వార్డ్ మెంబర్ గుటాల నవీన్ కుమార్, గుటాల ముత్యాలరావు , ఉయిక రవి, బాగుల మరిడి సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

'సోలార్‌ప్లేట్లు ఏర్పాటు చేస్తే అద్దె చెల్లిస్తాం'

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలో ఎస్సీ ఎస్టీ విద్యుత్తు వినియోగదారులకు 200 చదరపు అడుగుల ఇంటి స్లాబులో స్థలం ఇచ్చినవారికి ప్రతినెలా రూ.200 అద్దెగా చెల్లించడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులు తమ నివాసగృహాల స్లాబ్‌పై స్థలాన్ని సోలార్ ప్లేట్లు అమర్చుటకు అంగీకరిస్తే ఎపిఇపిడిసిఎల్ నుంచి ప్రతి 200 చదరపు అడుగులకు నెలకు రూ.200 చొప్పున అద్దె చెల్లిస్తారన్నారు. అదేవిధంగా వారు పొందుతున్న 200 యూనిట్ల ఉచిత సబ్సిడీని యధావిధిగా కొనసాగిస్తారని ఆయన తెలిపారు. సోలార్ ప్లేట్లు ఎపిఇపిడిసిఎల్ ద్వారా అంగీకరించిన గహాల యజమానుల ఇంటి స్లాబుపై ఏర్పాటు చేస్తారని తెలిపారు.ఆసక్తి గలవారు ఎపిఇపిడిసిఎల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

పలుచోట్ల పీసా కమిటీలకు ఎన్నికలు

దుంబ్రిగుడలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి కళావతి

ప్రజాశక్తి - యంత్రాంగం

దుంబ్రిగుడ: మండలంలోని అడపవలసలో సోమవారం పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి కళావతి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా టి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రామ్మూర్తిలను గ్రామస్తులు ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ఉపాధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల అధికారి కళావతి ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసా కమిటీ ఎన్నికల సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు రవి, సురేష్, తులసి రమేష్ పాపారావు దనుర్జయ్, శ్రీకాంత్ మహదేవ్ పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని కిటుములు పంచాయతీ పరిధిలోని కిటుములు, బౌడ సెగ్మెంట్లలో పీసా కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పంచాయతీ సర్పంచ్ వనము రమణమ్మ ఆధ్వర్యంలో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బౌడు నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా వైసిపి బలపరిచిన అభ్యర్థులు తాంబేలి దేవయ్య, సీందేరి సన్యాసిరావు, కార్యదర్శులుగా టిడిపి బలపరిచిన వనుము భీమన్న దొర, గడుతూరి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కొత్త కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి రాజకీయాలకు అతీతమని, కులమత భేదాలు లేకుండా ప్రజల అవసరాలను తీర్చడంలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వనుము పద్మ, ట్రైకర్ మాజీ డైరెక్టర్ సుర్ల లోవరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతపల్లి -2లో

చింతపల్లి-2 చిన్నగెడ్డ బూత్‌లో ఎన్నికల పర్యవేక్షణ అధికారి ఎస్‌లక్ష్మణకుమార్, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో పీసా కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఉపాధ్యక్షుల పదవికి కాంగ్రెస్ పార్టీ నుంచి గడపరాయి గ్రామానికి చెందిన కొర్ర మోహన్‌రావు, వైసిపి నుంచి చిన్నగెడ్డ గ్రామస్తుడు వేములపూడి పరమేశ్వరరావు పోటీ పడ్డారు. గడపరాయి, కందులగాధి, చిన్నగెడ్డ, మల్లవరం గ్రామాల నుండి మొత్తం 406 మంది ఓటర్లు ఓట్లు వేశారు. మోహన్‌రావుకి 226 ఓట్లు, పరమేశ్వరరావుకి 186 ఓట్లు వచ్చాయి. 43 ఓట్ల మెజారిటీతో మోహన్‌రావు గెలుపొందారు. కార్యదర్శిగా మల్లవరం గ్రామస్తుడు వంతల బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మోహన్‌రావు, బాలకృష్ణలను స్థానిక సర్పంచ్ పుష్పలత అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడుతూ తనకు మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా గెలుపొందిన వారికి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, కాంగ్రెస్, వైసిపి కూటమి పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

చింతపల్లి మండలంలో ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న పలువురు నాయకులు

వైద్యసేవల్లో నాణ్యత పెంచండి

సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పటిష్టమైన నాణ్యతా ప్రమాణాలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో జిల్లాలోని మూడు ఐటిడిఎల ప్రాజెక్టు అధికారులు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, అదనపు జిల్లా వైద్యాధికారులతో ఆసుపత్రుల నిర్వహణ, మెరుగైన వైద్య సేవలు లేబర్ రూం, ల్యాబొరేటరీలు, క్లినికల్ సేవలు, రోగుల హక్కులు, వైద్య సహాయక చర్యలలో తగిన నాణ్యతలు అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణపై జిల్లాలో ఆసుపత్రులు జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలన్నారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి 94.65 శాతం సాధించి జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గర్భవతులు చిన్నారులు, కౌమారదశ వైద్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాప్తి చెందే సామాజిక వ్యాధుల నివారణ మెరుగైన వైద్య సేవలను విధిగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రులలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతతో వైద్యసేవలు అమలు చేయాలన్నారు. దీని ఆధారంగా ఆసుపత్రుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తాయన్నారు. సోమవారం ఏడు ఆసుపత్రులు జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హర్షం వెలిబుచ్చారు. రాష్ట్ర స్థాయిలో 10 ఆసుపత్రులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో గంగవరం, దుంబ్రిగుడ, పెదవ మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, చింతూరు కమ్యూనిటీ ఆసుపత్రి ఎంపికయ్యాయని స్పష్టం చేశారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సికిల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో పాడేరు ఐటిడిఎ పిఒ డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కె. సింహాచలం, చింతూరు పిఒ అపూర్వ భరత్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వర నాయుడు, పలువురు అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు పాల్గొన్నారు.

బేస్ లైన్ టెస్టును పర్యవేక్షణ చేస్తున్న అబ్జార్వర్ జి.జాన్సన్ దేవరాజు

ఉత్తమ ఫలితాలు సాధనకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-పెదబయలు : ఏజెన్సీలోని గురుకులాల్లో పది తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రత్యేకాధికారి జి.జాన్సన్ దేవరాజు పేర్కొన్నారు. ఈ మేరకు పెదబయలు గురుకుల బాలుర పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణస్థాయిని నిర్ధారించే అర్హత ప్రమాణ పరీక్షల(బేస్ లైన్ టెస్ట్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో పది ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పదో తరతగిలో శతశాతం ఫలితాలకు గిరిజన గురుకుల కార్యదర్శి గౌతమి ఆదేశాలతో స్టేట్ అకడమిక్ మానిటరింగ్ యూనిట్‌కు అప్పగించడం జరిగిందని తెలిపారు. పెదబయలు బాలుర, పాడేరు, అరకులోయ బాలికల పాఠశాల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా తనను నియమించినట్లు చెప్పారు. ఇకపై ప్రతినెలా రెండుమార్లు ఆయా పాఠశాలలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డి.సూర్య శంకర్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలనాధికారిగా అప్పలస్వామి

ప్రజాశక్తి -పాడేరు : సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారిగా కొమ్ము అప్పలస్వామి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పౌరసరఫరాల శాఖలో డిప్యూటీ తాహశీల్దారుగా విధులు నిర్వస్తున్న అప్పల స్వామి పరిపాలనాధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయనకు సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, పలువురు తాహశీల్దారులు పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు.

సంతలో పారిశుధ్య పనులు చేయిస్తున్న సెక్రటరీ

రోడ్లపై చెత్తాచెదారం వేయొద్దు

ప్రజాశక్తి - హుకుంపేట: రోడ్లపైల్లె చెత్తా చెదారాన్ని వేయొద్దని, ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హుకుంపేట పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. సోమవారం మండల కేంద్రంలో సంతల్లో రోడ్డుకిరువైపులా మురుగుకాలువలను, వీధులను పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యాపారులు తమ దుకాణాల వద్ద చెత్తబుట్టలను విధిగా ఏర్పాటుచేసి, తడి పొడి చెత్తను వేరుచేసి వేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా వ్యవహరిస్తుందని, దాన్ని ప్రతిఒక్కరూ అమలు పరచాలని, అతిక్రమిస్తే జరిమానాలు, కేసులు ఉంటాయని హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా, మురుగుకాలువల్లో చెత్తాచెదారం వేస్తే దుర్గంధం వ్యాప్తి దోమలు విజ్రుంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు.

సిపిఎం నుంచి 'సూడిపల్లి' బహిష్కరణ

ప్రజాశక్తి - హుకుంపేట: సిపిఎం రాజకీయ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, వైస్ ఎంపిపి ఉప ఎన్నికల్లో అవినీతికి పాల్పడ్డారనే అభియోగంతో స్థానిక వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావును పార్టీ నుంచి బహిష్కరిస్తూ పార్టీ మండల కమిటీ తీర్మానించింది. ఈ విషయాన్ని పార్టీ మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకురాలు ఎస్.హైమావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీనిపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు. ఒంటెపు ప్రియాంక రాజీనామాతో ఖాళీ అయిన మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికల్లో బిజెపి, వైసిపి నుంచి ముడుపులు తీసుకుని వారికి అనుకూలంగా వ్యవహరించారనే అవినీతి అభియోగాలు ఆధారాలతో నిర్ధారణ కావడంతో ఆ మేరకు పార్టీ మండల కమిటీ సమావేశంలో వైస్ ఎంపిపి కొండలరావును తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సిపిఎం రాజకీయ విధానానికి వ్యతిరేకంగా పనిచేసేవారికి, అవినీతికి పాల్పడే వారికి పార్టీలో చోటులేదని స్పష్టం చేశారు. సమావేశంలో డి.కృష్ణమూర్తి, టి.కృష్ణారావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సిపిఎం నేతలు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ సిమెంట్ డీలర్ కాశీ దుర్గసాయి దుకాణం వద్ద వినాయక చవితి సందర్భంగా 500 కొత్తిమీర విత్తనాలతో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ కాశి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడంలో మట్టి విగ్రహాల వినియోగం కీలకమని తెలిపారు. మట్టి విగ్రహాలు నీటిలో కరిగిపోయిన తరువాత వాటిలో నిక్షిప్తం చేసిన విత్తనాలు మొలకెత్తి పచ్చదనాన్ని విస్తరించడంలో సహకరిస్తాయని వివరించారు. పర్యావరణ హితంగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ లోకేష్, టెక్నికల్ హెడ్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలో సోమవారం రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ ముంపు బాధితులు వరదలు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని ఈ సీజన్లో ఎక్కువగా డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ఎక్కువవుతాయని, అందువల్లనే పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ అధికారుల తీరు ఆక్షేపణీయం

ఆదివాసీలంటే అంత చులకనా : లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆదివాసీలు సమావేశం పెట్టుకునేందుకు రంపచోడవరం, మారేడుమిల్లి వైటిసిల్లో అనుమతులు ఇవ్వని ఐటిడిఎ అధికారులు, అధికారుల సమావేశం పేరిట డ్యాన్సులు వేయడానికి మాత్రం ఇస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. రంపచోడవరం వైటిసిలో శనివారం జరిగిన సంఘటనపై పూర్తి దర్యాప్తు చేసి, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీలతో ఐటిడిఎ ముట్టడిస్తామని, దానికి ఐటిడిఎ పిఒనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఐటిడిఎల పరిధిలో ఏర్పాటు చేసే ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి భవనం ఆదివాసులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. స్థానిక ఐటిడిఎ పిఒ మాత్రం ఆదివాసీలను కనీసం కూర్చొని మాట్లాడుకోవడానికి, సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి కూడా అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఇది ఆదివాసీలను అవమానించడమే అవుతుందన్నారు. గిరిజన జిల్లా ఏర్పాటు కోసం కూర్చుని మాట్లాడుకోవడం కోసం పిఎంఆర్‌సిలో ఉన్న హాల్ అడిగితే అనుమతి ఇవ్వడం లేదన్నారు. దీనిని బట్టి ఆదివాసులంటే ఎంతటి చులకన భావమో అర్థమవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమీపాన టేక్ ప్లాంటేషన్ మలుపు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మారేడుమిల్లి నుండి రంపచోడవరం వైపు వెళ్తున్న కారు తుర్రూరురామన్నవలస నుండి వస్తున్న ఓ బైకును ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అటు వైపుగా వెళ్తున్న ప్రయాణికులు 108 పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సిఐ నరేంద్రప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు: రైతులను సేంద్రియసాగువైపు ప్రోత్సహించాలని ఎఒ భానుప్రియాంక సూచించారు. మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఎంపిహెచ్‌ఒలతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. కొయ్యూరులో మండల గ్రామ వ్యవసాయ, ఉద్యాన, ఎంపిఇఒలకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసే ప్రతి రైతును పంట నమోదు చేయాలని, అప్పుడే ప్రభుత్వం నుండి అమలయ్యే పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

నేడు పీసా చట్టంపై క్షేత్రస్థాయి సమావేశం

ప్రజాశక్తి -వై.రామవరం: మండలంలో మంగళవారం రెండు గ్రామాల పంచాయతీలో పీసా చట్టాలపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ బాపన్నదొర తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎర్రంరెడ్డిపాలెం పంచాయతీలో మధ్యాహ్నం 2 గంటలకు దలిపాడు పంచాయతీలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఐటిడిఎ లీగల్ అడ్వైజర్, పల్లా త్రినాథరావు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

ఏజెన్సీలో 1/70 అమలుకు చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో 1/70 అమలు చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటి డిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రోడ్డు భవనాల శాఖ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, తహసిల్దార్‌తో 1/70 అమలు చేసే విధంగా రంపచోడవరం ఐటిడిఎ పిఒ, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్, ఎపిఒ జనరల్ డివిఎస్ రమణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టం నిబంధన ప్రకారం అమలుపరిచే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి సెప్టెంబర్ 2 వ తేదీ వరకరూ అక్రమ కట్టడాలు నివారించే విధంగా కార్యాలయాల పని రోజుల్లో ఉదయం 9: 30 గంటల నుంచి ఉదయం 11:30 గంటల వరకూ వారం రోజులపాటు గిరిజన సంఘాలు, గిరిజన ప్రతినిధులు పాత్రికేయ మిత్రులు తదితరుల నుంచి అక్రమ కట్టడాల నివారణకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి తదుపరి చర్యలు నిబంధన ప్రకారం చేపట్టడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ఏడు మండలాల్లోని గిరిజన ప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మూలించే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది 1/70 చట్టానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, తహశీల్దార్ బాలాజీ, డిఇ పి.వెంకటరమణ, ఎఇ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల రివ్యూ సమావేశంలో పాల్గొన్న పిఒ, సబ్ కలెక్టర్

అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సంక్షేమ పథకాలపై కళాజాతా

ప్రజాశక్తి - మారేడుమిల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఏజెన్సీలోని సత్యవర్మ కళాజాత ప్రతినిధి పార్వతిప్రసాద్ బృందం సోమవారం అవగాహన కల్పించింది. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, మారేడుమిల్లి ఎంపిడిఒ శ్రీనివాసవిశ్వనాథ్ ఆధ్వర్యంలో పాములేరు పంచాయతీలో సర్పంచ్, సెక్రెటరీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, బంగారు కుటుంబం, ఎన్టీఆర్ రైతుభరోసా, దోమల నివారణ, స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర, ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి నష్టం అనే అంశంపై కళాజాతా నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న ఉచితపథకాలపై స్వచ్ఛత టాయిలెట్స్‌పై కళాజాత రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, సెక్రటరీ ప్రజలు పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

సాధనకమిటి ఆధ్వర్యంలో శాంతియుత ఉద్యమం

ప్రజాశక్తి-సీలేరు: దారకొండను మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని వైసిపి సర్పంచి మురళి కమలమ్మ డిమాండ్ చేశారు . సాధనకమిటీ చేస్తున్న శాంతియుత ఉద్యమానికి ఆమె మద్దతు తెలిపారు. జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయితీ గుమ్మిరేవులు, నేలజర్తలో సర్పంచి మురళ కమలమ్మ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నాయకులు ప్రజలు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సాధనకమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తిని ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రం సాధించుకోవాలంటే ఏ విధంగా పోరాడాలో సూచన చేశారు.

అనంతరం దారకొండ మండల కేంద్రం ఏర్పాటుకు తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సర్పంచ్ కమలమ్మ మాట్లాడుతూ ఏజెన్సీలో 6 పంచాయతీ పరిధిలోని గిరిగ్రామాలు తరతరాలుగా అభివృద్ధిలో పూర్తిస్థాయిలో వెనుకబడి ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. సీలేరు దుప్పిలివాడ గుమ్మిరేవులు, ఏ.దారకొండ, గాలికొండ పంచాయతీ సర్పంచులు ఎంపిటిసిలు మండల కేంద్రం ఏర్పాటుకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దశలవారీగా మండల కేంద్రం ఏర్పాటుకు ఉద్యమాన్ని శాంతియుతంగా తీవ్రతరం చేయాలని తెలిపారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలో నూతనంగా ఎన్నికైన సిఐటియు మండల కన్వీనర్ సత్యనారాయణ. కో కన్వీనర్ అప్పలనరస సోమవారం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జెన్కో కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు విష్ణుకుమార్‌రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పాల్గొన్నారు. ఆయన పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కన్వీనర్, కో కన్వీనర్‌తో పాటు 15 మందితో కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ జికె విధి ఐసిడిఎస్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి పిఒ లేకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మండలంలో కార్మికుల సమస్యలను గుర్తించి అనునిత్యం పోరాటం చేస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు.

కన్వీనర్ సత్యనారాయణ,
కో కన్వీనర్ అప్పలనరస

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిఒ, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఎపిఒ జనరల్ డివిఎస్ రమణ పాల్గొన్నారు. ఈ వారం సుమారు 95 వినతులు వచ్చాయని పిఒ తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న పిఒ సింహాచలం, సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్

న్యాయపరమైన అంశాలపై అవగాహన

- జిల్లా సీనియర్ జడ్జి సన్యాసినాయుడు

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : న్యాయసేవాసదన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఎస్సి ఎస్టి వర్గాల ప్రజలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడానికి చట్టపరమైన హక్కులు, డిఎల్ఎస్ఎ ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవలు గురించి వివరించారు. అస్పృశ్యతను నిరోధించడానికి, దానివల్ల వచ్చే వివక్షను తొలగించడానికి రూపొందించబడిన పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 ప్రాముఖ్యత, అమలు గురించి తెలియజేశారు. వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్‌లు, మధ్యవర్తిత్వ ప్రక్రియ ఎలా ఉపయోగపడతాయో వివరించారు. రాబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో పాల్గొని, తమ కేసులను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పిఎల్‌ఎపి యుఎస్ చైర్మన్ జి.వల్లభనాయుడు, పదవీ విరమణ పొందిన న్యాయాధికారి ఎల్.అప్పారావు, ప్యానల్ న్యాయవాది జె.వీరలక్ష్మి, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - గంగవరం: పోలీసులు ఆర్‌డిపురం ప్రాంతానికి చెందిన కుంజం అమ్మాజీ, ఆమె భర్త కష్ణదొరని సారా తరలిస్తుండగా అరెస్టు చేశారు. వారిని రంపచోడవరం జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపరిచగా, కోర్టు 15 రోజుల రిమాండ్‌కు నిర్దేశించింది. అనంతరం వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ, అక్రమంగా సారా తయారీ, రవాణా లేదా విక్రయాలలో పాల్గొన్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని హెచ్చరించారు.